ఉండుండి నానీ నుంచి వినిపించే వెక్కిళ్ళను వింటూ “నువ్వింకా బ్రతికేవున్నావట్రా” అనబోయి గుండె గొంతుకడ్డం పడినట్టు ఆగి “వద్దమ్మా.... నాలాంటి వాడికి చీకటన్నా, వెలుగన్నా ఒకటేగా. ఇట్రా....” అన్నాడు గాద్గదికంగా.

నానీ కమిలిపోయిన ఒంటిని చూసి భరించే శక్తి లేదు. తన కళ్ల నీళ్ళను చూపించే స్థైర్యమూలేదు.

అందుకే చీకటినే ఇష్టపడ్డాడాయన.

ఆ వయోవృద్ధుడి పెదవులు ఎప్పటిలా మంత్రపుష్పాలు వల్లించడం లేదు. ఇంకా ఏం చూడాలని నేను మిగిలాను తండ్రి అంటూ వేదనతో భగవంతుడ్ని నిలదీస్తూ అదిరిపడుతున్నాయి.

“ఎందుకు చెప్పావురా పిచ్చినాన్నా.... చెప్పి నువ్వెందుకు ఆపదలో చిక్కుకుపోయావు” గొణిగాడు నెమ్మదిగా.

“పోలీసంకుల్ అడిగాడు తాతయ్యా.... అబద్ధం చెప్పలేదు. ఉన్నదున్నట్టే చెప్పేశాను....” తను ఏ తప్పూ చేయలేదని స్థిరంగా చెబుతుంటే లాలనగా తల నిమిరాడు.

ఇప్పుడేం జరగబోతోంది.

ఇంతమందిని ప్రమాదంలోకి నెట్టే సత్యం చెప్పిన నానీని బ్రతకనిస్తారా?

మధనపడిపోతున్నాడాయన.

నానీ భయంతో తలెత్తి చూశాడు.... ఒకవేళ నాన్న మళ్లీ వచ్చాడేమో అని.

సరళత్తయ్య నిలబడి వుంది “రా.... భోంచేద్దువుగాని” చెప్పి వెళ్ళిపోయింది.

కదలబోయిన నానీ చెయ్యిపట్టుకున్నాడు విశ్వేశ్వరశాస్త్రి “ఒరేయ్” అనుమానాన్ని మనసులో దాచేసుకుంటూ “మీ అమ్మ ఉన్నంతకాలం నీకు తనే అన్నం పెట్టేది. అవునా....” అన్నాడు.

తలూపేడు నానీ

“మరి ఇప్పుడా బాధ్యత నువ్వు తీసుకోవాల్రా భడవా.... అంటే ఇంట్లో నీకు నానమ్మగాని అత్తయ్యగాని అన్నం పెట్టగానే ముందు మొదటి ముద్ద నాకు తినిపించాలి - అప్పుడుగాని నువ్వు తినకూడదు.”

అమ్మలాంటి బాధ్యత తనే తీసుకోవాలన్న ఆలోచన ఎంతో సంతోషాన్నిచ్చింది. అందుకే ఆనందంగా ఒప్పుకున్నాడు!

“ఒట్టేయ్”

కదలనని మొరాయిస్తున్న తాతయ్య చేతిలో ఒట్టుకూడా వేసేశాడు.

సరళ అప్పటికే అన్నం కలిపి తెచ్చింది “ఇలా రా.... అన్నం తిందువుగాని.”

ఎప్పుడూ లేమది అత్తయ్య అంత ప్రేమ చూపించడంతో ఎంతో అబ్బురపడిపోయాడు.

"నిన్నేరా.... రా అమ్మా"

ఆ మాత్రం ప్రేమ చాలు నాకు అన్నంత ఉద్వేగంతో వెళ్ళబోయాడుగాని తాతయ్యకిచ్చిన మాట గుర్తుకొచ్చి ఆగిపోయాడు.

"నేం తింటానత్తయ్యా."

"ఏం.... నేను తినిపించకూడదా?"

"అదికాదత్తయ్యా.... నేనిక్కడ తింటానన్నానుగా"

"చెప్పేది నీకే" ఈసారి ఆమె కంఠం కర్కశంగా మారింది.

"ఎందుకమ్మా వాడ్నిలా ఇబ్బంది పెడతావు.... వాడికి తినిపించడమెందుకు.... చిన్నపిల్లాడు కాదుగా" జోక్యం చేసుకున్నారు విశ్వేశ్వరశాస్త్రి.

ఈ సారి తండ్రివేపు క్రోధంగా చూసిన సరళ ఉక్రోషంగా అన్నంగిన్నె నానీ ముందుంచి వెళ్లిపోయింది.

ఆ అవకాశం కోసమే తనూ ఎదురుచూస్తున్నట్టు వేగంగా చిన్ని పిడికిలితో ముద్దలు చేసి తాతయ్య నోటిలో ఓ ముద్ద పెట్టాడు.

పొలమారిన విశ్వేశ్వరశాస్త్రి ఊపిరందనట్టు ఉక్కిరి బిక్కిరౌతుంటే భయంగా చూశాడు నానీ.

** ** ** **

"సరిగ్గా అరగంట లేటు" అంది హరిత పోర్టికోలో బులెట్ ఆపిన యశస్విని చూస్తూ.

"పాపం ఓ అర్ధయుగం వియోగంతో బాధపడ్డావన్నమాట" అన్నాడు హాల్లోకి అడుగుపెడుతూ.

"నాకు తెలుసు మీ డిపార్ట్‌మెంట్ సంగతి"

"ఏం తెలుసు" అన్నాడు.

"ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్‌కి పోలీస్ డిపార్ట్ మెంట్‌కి పెద్ద తేడా లేదని.

"అంటే"

నవ్వింది "మరేం లేదు.... వాళ్ళు ఇళ్ళు తగలబడిపోతున్నాయని ఫోన్ చేస్తే స్పాట్‌కి వచ్చి నీళ్ళ కోసం గాలింపు మొదలుపెడతారు. నేరం జరుగుతుందని ఫోన్ చేస్తే నేరస్థుడు పోయేదాకా ఆగి తీరుబాటుగా వచ్చిన మీరేమో సాక్షుల కోసం గాలింపు ప్రారంభిస్తారు."

"అది తెలుగు సినిమాల్లో" మృదువుగా నవ్వి అన్నాడు "మీ డాడి లేనట్టున్నారు"

"చెప్పానుగా ఆయన ఈ సమయంలో వుండరని" యశస్వి సమీపంలో కూచుని అడిగింది "అంటే జవాబుతో వచ్చావన్నమాట"

"అవును.... ఇప్పుడు సెక్షన్ 375 తో అవసరం లేకుండా పందెం నెగ్గేయబోతున్నాను."

"వెల్! నేనూ ప్రిపేరయ్యే వున్నాను" మోకాళ్లపై చేతులానించి ఉత్సుకతగా అతడి కళ్ళలోకి చూసింది.

అరక్షణంపాటు కళ్ళు మూసుకున్నాడు.

"ఆ యువకుడు ఏదన్నా ఓ నిజాన్ని వాక్యంగా చెబితే సుఖంగా ఉరి తీయబడతాడు. లేకపోతే రాక్షసంగా సెడ్యూస్ చేయబడి ప్రాణాలు కోల్పోతాడు.
అంతేగా?"

"అవును."

"అతను తన ప్రాణాలు కాపాడుకోవాలంటే ఏ నిజం చెబితే సాధ్యమా అన్నది నేను చెప్పాలి. అంతేగా"

"యస్"

నిజానికి ఆమె నిశ్చేష్టురాలయింది అంత సునాయాసంగా జవాబు దగ్గరగా వచ్చినందుకు.

ఎందర్నో తికమక పెట్టింది అసలు దానికి జవాబే లేదని అందరూ అంటుంటే యశస్వి అందరిలో ఒకడౌతాడూ అని అనుకుంది తప చెప్పగలడని వూహించలేకపోయింది.

"ఆ యువకుడు రాణిని చూస్తూ మీరు నన్నిపుడు సెడ్యూస్ చేయించి ప్రాణాలు తీయాలనుకుంటున్నారన్నదే నిజం అన్నాడు."

"అయితే!"

"అతడు నిజం చెపితే సుఖంగా ఉరి తీయిస్తాను అన్న కండిషను ప్రకారం ఇప్పుడు రాణి ఆ పని చేయలేదు... ఎందుకంటే సెడ్యూస్ చేయించబోతున్నారన్నది నిజం అంటూ ఆమె వూహించని ఓ నిజం చెప్పాడు కాబట్టి"

"అప్పటికయినా సెడ్యూస్ చేయించి చంపేయొచ్చుగా."

"అప్పుడతడు చెప్పింది అబద్ధం కావాలి. కాని సెడ్యూస్ చేయించడం నిజమన్నాడుగా - సో.... ఇప్పుడు రాణి ఉరి తీయనూలేదు సెడ్యూస్ చేయించనూ లేదు."

"తప్పయింది" అంటూ దూరంగా జరిగింది.

"ఏంటి జవాబా?"

"కాదు, నీ గురించి నేనువేసిన అంచనా" వేగంగా నడిచి టేబుల్ పైవున్న ఫోన్ రిసీవర్ని అందుకుంది. ఎవర్కో డయల్ చేసి "ఒసేవ్ ఆశా.... నేనే ఓడిపోయాను. ఆయన చెప్పేశారు. కాబట్టి నువ్వూ ఓడి పోయావు. సో.... విశాల పెళ్ళికి నువ్వు విజయవాడ వస్తున్నావు.... సరేనా..... థ్యాంక్యూ" అంటూ క్రెడిల్ చేసింది.

యశస్వికి హరిత ఏం మాట్లాడిందీ అర్థం కాలేదు.

"ఆశ్చర్యపోకండి మాస్టారూ.... విజయవాడలో స్నేహితురాలు పెళ్ళికి రమ్మని నేను ఆశనే ఫ్రెండుని అడిగాను.... రాను పొమ్మంది.... మా ఒప్పందం ప్రకారం నేనడిగిన పజిల్కి అది జవాబు చెప్పేస్తే దాన్ని నేను విడిచిపెట్టేయ్యాలి. పజిల్ అంతా విని అదేమందో తెలుసా.... అసలు నీ పజిల్కి జవాబేలేదు.... ఉంటే నువ్వంతగా ఇష్టపడే యశస్విని చెప్పమను

అంటూ గమ్మత్తుగా లింకు పెట్టింది"

వింటున్నాడు ఉత్సుకతగా.

"యశస్వి చెప్పినా చాలు నేనూరుకొస్తాను అనేసరికి నాకూ అనిపించింది."

"ఏమని?"

"నీ సరుకేమిటో తెలుసుకోనూవచ్చు అటు నువ్వు చెప్పేస్తే దాన్ని వూరికి రప్పించనూ వచ్చని పొద్దుటే ఈ ప్రయోగం చేశాను.... తెలిసిపోయింది."

"ఏంటో"

"నీ ఐక్యూకే ఢోకా లేదని యూ ఆర్ డిఫరెంట్ ఫ్రమ్ ది డిపార్టుమెంటని".

"థాంక్యూ" యశస్వి పెదవులపై విడివిడని నవ్వు

ఆమె భుజాలపై సుతారంగా చేతులుంచి "మీ డాడీ వచ్చే టైమైపోతోంది" అన్నాడు.

"రానియ్.... నీకు పరిచయమేగా"

"కాని మన పందెం సంగతి తెలీదుగా"

గభాలున దూరంగా జరిగింది "అంటే మరచిపోలేదన్న మాట ఇంకా"

"ఐ.పి.సి.లో ఏ పోలీసాఫీసర్ మరచిపోలేని సెక్షన్ నెంబర్లలో 375 ఒకటి."

"ఆ సెక్షను ఇప్పుడు అమలు చేద్దామనుకుంటే మీ ఉద్యోగం ఊడుతుంది" ఆకతాయితనంగా మాట్లాడుతున్నా అతడి స్పర్శతో ఆమె క్రమంగా వివశురాలైపోతూంది "అయినా మనం అగ్రిమెంట్ ఏం రాసుకోలేదు."

"ఇట్స్ మోరల్ బైండింగ్."

"ఆ మోరల్స్ కోసమే పెళ్ళికి ముందు ఇలాంటి వాటికి బైండ్ కాకూడదంటున్నాను...." ఆమెను దగ్గరగా లాక్కోబోయేంతలో బూట్ల చప్పుడు వినిపించి దూరంగా జరిగిపోయాడు.

కంగారుగా వెనక్కి తిరిగిన యశస్వి హరిత తండ్రి పాండురంగారావుని చూసి తొట్రుపడిపోతూ "గుడీవినింగ్ సర్" అన్నాడు.

"గుడీవినింగ్.... ఏంటీ ఇంకా నిలబడే వున్నావు" ఒక పెద్ద పదవిలో వున్నా భేషజంలేని వ్య క్తాయన . చాల ఉత్సాహంగా మాట్లాడేస్తుంటాడు. "నో.... ఇదేం బాగోలేదమ్మా.... ఇంటికొచ్చిన అతిథుల్ని గౌరవించడం మన ధర్మం."

"కరెక్టు సర్.... గౌరవంగా మాట నిలబెట్టుకుంటుందేమో అని అయిదు నిముషాలుగా చూస్తున్నాను"

ఆ మాటల్లోని నిగూఢతని అర్థం చేసుకున్న హరిత హడావుడి పడిపోయింది తండ్రెక్కడ గుర్తుపడతాడో అని.